

తాగునీటి సరఫరాపై ఫిర్యాదులకు సెల్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు సరఫరాలో ఆటంకం లేకుండా ఫిర్యాదులను స్వీకరించడం కోసం 9100121190 ఫోన్ నెంబరులో ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా సంస్థ ఎస్ఇ బివి.గిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో నీటి సరఫరా సమస్యలని ఎదుర్కొంటున్న గ్రామ పంచాయతీలకు సాంకేతిక సహాయాన్ని అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఒహెచ్ఆర్ఎస్‌ల నిర్మాణం, పైపు లైన్లు, గృహాలకు కుళాయి కనెక్షన్‌లు వంటి వాటి నిర్వహణ వ్యవస్థ గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రభుత్వ నిధులను స్థానిక సంస్థలకు నిధులు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 14 లక్షల 74 వేల మందికి తాగునీటి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

టిఎ, డిఎల కోసం అంగన్‌వాడీల నిరీక్షణ

- ఏడేళ్లుగా అలవెన్స్‌ల పెండింగ్
- బకాయిలు రూ.18 కోట్ల పైమాటే



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అంగన్‌వాడీ కార్యకర్తల టిఎ, డిఎ బిల్లులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. టిడిపి అధికారంలోకి వచ్చాక టిఎ, డిఎల చెల్లిస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. చివరిసారిగా 2017 నవంబరులో టిఎ డిఎలు ఇచ్చారు. అప్పటి నుంచి సుమారు ఏడేళ్లుగా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.18 కోట్ల పైగా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతంతమాత్రంగా వచ్చే జీతంలో నుంచే వీరు ప్రతినెలా రూ.వెయ్యి వరకు సమావేశాలకు రానుపోను ఖర్చు పెట్టుకుంటున్నారు. ఇటువంటి బకాయిలు ఎప్పుడు ఇస్తుందో తెలియదు. పోనీ గట్టిగా నిలదీద్దామనుకుంటే.. తమ పోస్టుకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. స్త్రీ, శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహార అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 1000 మంది జనాభాకు ఒక మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, 150 మంది జనాభాకు మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో తనిఖీల పేరుతో వేధింపులకు గురి చేస్తున్న విషయం విదితమే. అయితే నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతోంది.

జిల్లాలో 7 ప్రాజెక్టులు

జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాల చొప్పున 1562 ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కర్, హెల్పర్‌తో కలిపి మొత్తం 3,072 మంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 26 మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఆరు నెల పసిబిడ్డ నుంచి మూడేళ్ల పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దీనికిగాను ప్రతి నెలా ప్రాజెక్టు, సిడిపి కార్యాలయాల్లో సమావేశాలు.. రేషన్‌బియ్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ సమావేశాలకు హాజరయ్యే వర్కర్లకు భోజనానికి, రవాణా ఖర్చు కోసం ప్రభుత్వం నగదు ఇస్తుంది. గతంలో టిఎ, డిఎలు కలిపి ఒక్కో వర్కర్‌కు రూ.450 నుంచి రూ.600 వరకు ఇచ్చేవారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లింపులు నిలిపివేసింది.

జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు పైగా బకాయిలు

అంగన్‌వాడీ వర్కర్లకు నెలలో రెండు సమావేశాలుంటే రూ.550, మూడు సమావేశాలుంటే రూ.600 వరకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో దాదాపు నెలలో మూడు సమావేశాలకు తక్కువ లేకుండా జరిగాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.2.50 కోట్లు చెల్లించాలని అంచనా. గడిచిన ఏడేళ్ల కాలంలో కలిపి సుమారు రూ.18 కోట్లు పైబడి బకాయిలు ఇవ్వాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. సరుకుల రవాణా ఖర్చులను సొంత నిధులు వెచ్చించేవారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో గత ప్రభుత్వం ఎండియు ఆపరేటర్లకు రవాణా బాధ్యతలను అప్పజెప్పింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ వ్యవస్థను నిలిపివేసే యోచనలో ఉంది. ఈ నేపథ్యంలో తిరిగి మళ్లీ రవాణా ఖర్చులు తప్పవని ఆందోళన అంగన్‌వాడీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రావాల్సిన టిఎ, డిఎలు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

తక్షణం టిఎ, డిఎ బకాయిలు విడుదల చేయాలి

జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న టిఎ, డిఎ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి. సదరు సర్వేల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయటంతో సంక్షేమ పథకాలు వర్తింపచేయడం లేదు. అంగన్‌వాడీల కుటుంబ సభ్యుల్లో ఎవరైనా 90 శాతం వికలాంగ సర్టిఫికెట్ ఉన్నా పెన్షన్లు మంజూరు చేయడం లేదు. కొత్త రకాల యాప్‌లతో ఇబ్బందులు, పని ఒత్తిడి పెరుగుతోంది. ఇతర పనులు మినహాయించాలి.

- కె.ఎం.బేబీరాణి, జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్.



ఖాళీ బిందెలతో రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

తాగు నీటికోసం బిందెలతో నిరసన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో ఇందిరా కాలనీ వద్ద తాగు నీరు లేక ఇబ్బందిగా ఉందని మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. పంచాయతీ సిబ్బంది పట్టించుకోక తాము తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, వేసవి కాలంలో కూడా ఇలాంటి పరిస్థితి రావడం చాలా దారుణమని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగు నీరు సరిగా ఇవ్వడం లేదని స్థానిక ప్రజలు స్థానిక నాయకులను నిలదీశారు. ఈ నేపథ్యంలో మహిళలతో కలిసి స్థానిక నాయకులు జాతీయ రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని టిడిపి సీనియర్ నాయకులు సుంకర దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి పై రెండు గంటల సేపు బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకొని చర్చించారు. తాగునీరు అందేలా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

కేన్సర్ సర్వే తీరుపై ఎంఎల్ఎ నల్లమిల్లి ఆగ్రహం

ప్రజాశక్తి-బిక్కవోలు



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఎల్ఎ

బలభద్రపురంలో కేన్సర్ నిర్ధారణ కోసం చేపట్టిన సర్వే తీరుపై ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే తీరు, ప్రిన్సిపల్ సెక్రెటరీకి సమర్పించిన తప్పుడు రిపోర్టు పట్ల, వైద్యాధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సరైన విధానంలో నిర్ధారణ జరపకుండా నివేదికలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వాన్ని తప్పు దారి పట్టించడం సరికాదన్నారు. బలభద్రపురంలో క్యాన్సర్ ప్రమాదం గురించి తాను అసెంబ్లీలో లేవనెత్తిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం, ఆరోగ్య శాఖ మంత్రి స్పందించారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మెడికల్ టీములు ఇక్కడకు వచ్చి ఇంటింటి సర్వే చేస్తున్నారని తెలిపారు. అధికారులు ఇక్కడ 6 కేసులు మాత్రమే ఉన్నాయని హెల్త్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వగా వారు తనకు సమాచారం ఇచ్చారని తెలిపారు. తాను 15 కుటుంబాలను పరామర్శించానని చెప్పడంతో కమిషనర్ తక్షణం హెల్త్ బృందాలను పంపారని తెలిపారు. సర్వే జరిగిన తీరు లోపభూయిష్టంగా ఉందని, సామాన్యులకు అర్థం కాని ప్రశ్నలు అడగటం వల్ల ఏం ఉపయోగం లేదన్నారు. స్క్రీనింగ్ టెస్టులు జరుగకుండా రోగ నిర్ధారణ ఎలా సాధ్యమని ఎంఎల్ఎ ప్రశ్నించారు. సమగ్రమైన సర్వే పూర్తయ్యే వరకూ తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని తెలిపారు.

పౌష్టికాహార కిట్స్ అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

టిబి వ్యాధిగ్రస్తులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పౌష్టికాహార కిట్స్ అందజేశారు. ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంగా ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా సేవలు అందించాలని సూచించారు. దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ గ్రామంలోని పాఠశాలలో పాడై పోయిన ఆర్ఒ ప్లాంట్‌పై మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. టిబి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించిన సర్పంచ్‌లను మంత్రి దుర్గేష్ ఘనంగా సన్మానించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్ ప్రసాదరావు, వివి.ఆశా జ్యోతి పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌తో నాయకులు, వైద్య సిబ్బంది



పోలీసులతో మాట్లాడుతున్న శివ గణేష్

శాంతియుత నిరసనలను అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి-గోకవరం

గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథైల్ ఆల్కహాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలను అడ్డుకోవడం తగదని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ తెలిపారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో గుమ్మళ్లదొడ్డి వెళుతుండగా మార్గమధ్యలో వీరలంకపల్లి వద్ద పోలీసులు నిలువరించారు. శివ గణేష్‌తో పోలీస్‌లు వాగ్వాదానికి దిగారు. అనంతరం శివ గణేష్ మాట్లాడుతూ శాంతియుతమైన నిరసన తెలియజేసుకోవడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, ఆ హక్కును హరించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమేనని, పెట్టుబడిదారుల తరపున ప్రభుత్వం ప్రజలపై చేస్తున్న దౌర్జన్యానికి ఇది పరాకాష్ట అన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడడం కోసం, అస్సాగో పరిశ్రమను గుమ్మళ్లదొడ్డి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. బాధిత ప్రజలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాడుతూనే ఉంటామని శివ గణేష్ తెలిపారు. గుమ్మళ్ళదొడ్డి సర్పంచ్ శరకణం మురళి, శ్రీవత్సవాయి సత్యనారాయణరాజు, డాక్టర్ నక్కా సత్యనారాయణ, కొండ శ్రీను, బొల్లం బాపిరాజు, గుర్రాల రత్నాజీ రావు, నేదురు భాస్కరరావు, చంద్రమౌళి వెంకటరత్నం పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో హక్కులు కాపాడుకోవాలి

అమరవీరులైన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వంటి స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలు చేయాలని పలువురు పిలుపు ఇచ్చారు. వారి 94వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఆదివారం వారికి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్కెట్లో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి, ఆర్ట్స్ కళాశాల ఆవరణలో హాస్టల్‌లో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్, కె.జ్యోతి మాట్లాడారు. కమిటీ సభ్యులు మేఘన, నాగచైతన్య, కార్తీక్, హేమంత్ పాల్గొన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వంతల రాంబాబు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి, బి.పూర్ణిమ రాజు, నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, పైడియ్య తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఆర్ట్స్ కాలేజ్‌లో పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. కె.భాను ప్రసాద్, దినేష్, సతీష్, రోహిత్, చంద్రశేఖర్, కౌశిక్ పాల్గొన్నారు.



కడియంలో భగత్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యాన..

కడియం భగత్ సింగ్ ప్రాణత్యాగం నేటితరం యువతకు అర్థం కావాలని న్యాయవాది తోరాటి వసంతరావు, భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షులు తమ్మిశెట్టి ప్రసాద్ పేర్కొన్నారు. కడియంలో తమ్మిశెట్టి ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిలుకూరు శ్రీనివాసరావు, చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం,కొత్తూరి బాల నాగేశ్వరరావు, తోరాటి శ్రీనివాసరావు, కల్యాణం సూరిబాబు, కొత్తూరి కృష్ణ, కోటిపల్లి వెంకటేశ్వరరావు, తామెళ్ల వెంకటేశ్వరరావు, మర్రి సుబ్రమణ్యం, శాఖ సురేష్, ఉంగరాల వీరభద్రరావు, అంజి, మర్రి శంకర్, మణి, చిలుకూరి సుబ్బరాజు, బుచ్చన్న పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరపల్లి డివైఎఫ్ఐ నాయకులు ఘట్టం నాని ఆధ్వర్యాన త్యాజంపూడిలో ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు నాయకులు ఎ.శ్రీనివాసరావు మాట్లాడారు. సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, కె.మణికంఠ, ఎస్.భాస్కర్, టి.సాయి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్, కార్పొరేషన్, పురపాలక సంఘాల పరిధిలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో అదే విధంగా డివిజన్, మున్సిపల్, మండల కేంద్రంలో ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పిజిఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేకాధికారులు, జిల్లా, డివిజన్ మండల, మున్సిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని స్పష్టం చేశారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-చాగల్లు

సోమవారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు చాగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అలీ తెలిపారు. సోమవారం డ్రై డే నిర్వహించి తాగునీటి సరఫరా చేసే ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రపరుస్తామని తెలిపారు. దీంతో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు

స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-నల్లజర్ల

దూబచర్లలోని వసంత నగర్ కాలనీలో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వంజరాపు సన్యాసమ్మ, భైరవపాటి వెంకటేశ్వరరావుకు చెందిన రెండు ఇళ్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయి రెండు కుటుంబాల వారు నిరాశ్రయులు అయ్యారు. ఈ ప్రమాదంలో వారి బతుకుదెరువుకు సంబంధించిన సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యింది. రెండు కుటుంబాల వారు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకొన్న జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, పూరెళ్ల సత్యనారాయణ, శివకాల సురేష్ ఆధ్వర్యంలో బాధితులకు రూ.8 వేల చొప్పున నగదు, బియ్యం, నిత్యావసరాల సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి జన సైనికులు ఎల్లప్పుడు అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుడిసె శివకృష్ణ, కవులూరు సత్తిబాబు, రుద్ర శ్రీను, సౌజన్య, ఉన్నమట్ల రమేష్, కొత్తపల్లి హరిబాబు, తలంశెట్టి శ్రీనివాసరావు. తలంశెట్టి శివప్రసాద్, బాలకృష్ణ, సతీష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.




బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న సువర్ణ రాజు

విశ్వవిద్యాలయం స్థాయికి 'డ్రీమ్స్' చేరాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

డ్రీమ్స్ విద్యాసంస్థలు భవిష్యత్తులో విశ్వవిద్యాలయం స్థాయికి చేరాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో జరిగిన 15వ వార్షికోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఈ విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులను మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యను సాధారణ ఫీజులకే అందిస్తున్న డ్రీమ్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్స్ స్కూల్స్ ప్రిన్సిపల్స్ వి.సంధ్య కుమారి జి.విమల రోజీ, ఎన్.దీపిక, కె.లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

దూబచర్లలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన సంఘటన జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు తీవ్రంగా ఖండించారు. దోషులను వెంటనే గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన నల్లజర్ల పోలీస్ స్టేషన్లో సిఐను కలసి వినతిపత్రం అందజేశారు ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలను నివారించాలన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కవులూరు సత్తిబాబు, రుద్రా శ్రీనివాస్, తలారి సౌజన్య, ఉన్నమట్ల రమేష్, గుడిసె శివకృష్ణ, ఉన్నమట్ల సత్య, కొత్తపల్లి హరిబాబు, పూరెళ్ల సత్యనారాయణ, దగాని శ్రీనివాస్, గుండాబత్తుల వరుణ్, ఉన్నమట్ల ఇస్సాక్, చెల్లు కృష్ణమూర్తి, తలంశెట్టి శ్రీనివాస్, గూడేపు దుర్గారావు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-గోపాలపురం

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం రాత్రి సుమారు 200 మందికి ఆయన రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. టిడిపి గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన విందులో ఎంఎల్ఎ వెంకటరాజు, మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మైనారిటీ నిరుద్యోగ యువతకు చదువు అర్హత బట్టి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన వారికి బిసి కార్పొరేషన్ ద్వారా లోన్లు అత్యధిక మందికి ఇప్పించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఘనంగా కుసుమ ధర్మన్న జయంతి

ప్రజాశక్తి-కడియం



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామి ప్రసాద్

కుసుమ ధర్మన్నది తెలుగు సాహితీ లోకంలో ఒక వీరగాథని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి స్వామి ప్రసాద్ పేర్కొన్నారు. ధిక్కార కవి కుసుమ ధర్మన్న 125వ జయంతి కార్యక్రమం మండలంలోని జేగురుపాడులో సేవా స్తంభ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ధర్మన్న సంస్కరణ, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, సామ్యవాద భావనల అపురూప సమ్మేళనం అనడంలో సందేహం లేదని స్వామి ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వమే కుసుమ ధర్మన్న సహకార బ్యాంకును స్థాపించి అట్టడుగు వర్గాల వారి అభివృద్ధికి కృషి చేశారని, ఆయుర్వేదంలో ఆయుర్వేద బిషక్ కోర్సులు పూర్తిచేసి అట్టడుగు వర్గాల వారికి ఆయన వైద్య సేవలు అందించారని, సాహితీవేత్తగా, పత్రికా సంపాదకునిగా, నిబద్ధత కలిగిన సాంఘిక విప్లవకారునిగా కుసుమ ధర్మన్న కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ ధర్మన్న సాహిత్య సాంస్కృతిక పీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎం.భూషణరావు, సాహితీవేత్తలు డాక్టర్ ఎం.సత్యనారాయణ, డాక్టర్ ఎంఎన్.సత్యనారాయణ ప్రముఖ కవి టి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

'బాపూజీ'లో ప్రమాణాలతో కూడిన విద్య

ప్రజాశక్తి-గోపాలపురం

నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించి విద్యార్థులను తీర్చిదిద్దడమే బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లక్ష్యమని కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. గోపాలపురంలో బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్థాపించి 15 సంవత్సరాల పూర్తయిందని అన్నారు. నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు విద్యార్థులను విద్యావంతులుగా తీర్చడమే లక్ష్యంగా స్కూలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటికి సుమారు 450 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలో క్రమశిక్షణ విలువలు నేర్పించి నేటి కాలానికి అనుగుణంగా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు



మీడియాతో మాట్లాడుతున్న సిఐ చైతన్యకృష్ణ

చోరీ కేసుల్లో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ సర్కిల్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన నిందుతుడిని అరెస్టు చేసినట్లు సిఐ చైతన్యకృష్ణ తెలిపారు. ఆదివారం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యు.కొత్తపల్లికి చెందిన బొండపల్లి ఏసుకుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, చిన్నతనంలో తల్లి చనిపోవడం, తండ్రి పర్యవేక్షణ లేకపోవడంతో వ్యసనాలకు బానిసై, బైక్ చోరీలను వృత్తిగా చేసుకున్నాడని తెలిపారు. ఇతనిపై ఉభయగోదావరి జిల్లాలో 10 కేసులు నమోదయ్యాయన్నారు. తిమ్మాపురంలో వాహన తనిఖీలు చేస్తుండగా ముద్దాయిని అదుపులోకి తీసుకుని, 18 బైకులు, బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన రెండు బంగారు ఉంగరాలు, గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి, తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఒ ఆర్.సుస్మిత, ఎస్ఐలు రవీంద్రబాబు, ఆర్‌విఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ భార్యను వేధిస్తున్న భర్త, అత్తమామలు, ఆడపడుచులపై పోలీసులు కేసు నమోదు చేశారు .ఆదివారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన తీపర్తి భవానీకి,. పెరవలి మండలం తిపర్రు గ్రామానికి చెందిన తీపర్తి సత్యనారాయణతో 2018 లో వివాహం పెద్దల సమక్షంలో జరిగింది. వీరికి ఒక పాప ఉంది. భర్త పెయింటింగ్ పని చేసుకుని భార్య, పాపను పోషించుకుంటున్నాడు. పెళ్లి సమయంలో రూ.2 లక్షల కట్నం, రూ. 50 వేలు ఆడపడుచు కట్నంఇచ్చారు. ఇటీవల కాలంలో సత్యనారాయణ తాగుడుకు బానిస అయ్యాడు. అదనపు కట్నం తేవాలంటూ భార్యను రోజు వేధించేవాడు. దీనికి తోడు అత్తమామలు ఆడపడుచులు పెట్టే వేధింపులు తట్టుకోలేక ఆమె ఆదివారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు పై భర్త అత్త మామ ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

బైకు దొంగల అరెస్టు 31 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకుల చోరీలు పెరిగిన నేపథ్యంలో సిఐ షేక్ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శివప్రసాద్, ఆధ్వర్యాన ప్రత్యేక నిఘా పెట్టారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నల్లజర్ల మండలానికి చెందిన ఇద్దరు నిందితులు తూర్ల సోమయ్య, చీర్ల కిషోర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 31 బైకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బైకుల విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని తెలిపారు. బైకులను రికవరీ చేయడంలో ప్రతిభ కనపరిచిన ప్రకాష్ నగర్ సిఐ షేక్ బాజీలాల్, ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి డి.నరసింహ కిషోర్ అభినందించారు.

దాడి చేసి బైకు అపహరణ

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడు గ్రామ శివారు కుంకుడిమిల్లి గ్రామానికి చెందిన పెద్దింటి రామకృష్ణపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆయన బైకుతో పరారైన సంఘటన ఆదివారం మీనానగరంలో చోటు చేసుకుంది. తన కోళ్ల ఫారాల నుంచి ఇంటికి వెళుతుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తనను గాయపరిచి తన బుల్లెట్ మోటార్ సైకిల్ తీసుకుని పారిపోయినట్టు రామకృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను చాగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - చాగల్లు

మార్కొండపాడు గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 21వ తేదీ నుంచి అదృశ్యమైనట్టు ఆమె తల్లిదండ్రులు ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సీతానగరం

పేకాట స్థావరాలపై సీతానగరం పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.8,400 నగదు, మూడు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

దాడికి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రేష్ డ్రైవింగ్ చేస్తూ ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. శనివారం గొల్లప్రోలు బైపాస్ తాటిపర్తి రోడ్డు ప్రాంతంలో రేష్ డ్రైవింగ్ చేస్తున్న వారిని ఆ మార్గంలో వెళ్తున్న తాటిపర్తికి చెందిన మురాళిశెట్టి సూర్యతేజ, పేకేటి ప్రసాద్ ప్రశ్నించారు. అ సమయంలో ఆ వ్యక్తులకు సంబంధించిన మరికొం తమంది వచ్చి సూర్యతేజ, ప్రసాద్‌పై దాడికి దిగారు. ఈ దాడిలో గాయపడిన ఇద్దరిని పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సీతానగరం

ఆదివారం ఉండేశ్వరపురం గ్రామ శివారు తోటల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సీతానగరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.5 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారమేదీ..?

ప్రజాశక్తి - యానాం

యానాం డంపింగ్ యార్డు సమస్యతో సతమతమవుతోంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య సాగుతోంది. ప్రస్తుతం బంద్ నిర్వహించే వరకూ వచ్చింది. డంపింగ్ యార్డు యానాం - కనకాలపేట రోడ్డులో ఉంది. అయితే రోజూవారీ చెత్తను రీసైక్లింగ్ చేయకపోవడం, చెత్త పెద్ద అనకొండలా మారడం, చెత్తకు నిప్పుపెడుతుండటతో అది నిత్యం దట్టమైన పొగతో మండే కొలిమిలా మారడం వెరసి పరిసర ప్రాంతాల ప్రజల ఆగ్రహానికి కారణం అవుతోంది. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని నెలలు క్రితం స్థానిక పవర్ గ్రిడ్ వద్ద



ప్రస్తుతం కనకాలపేట డంపింగ్ యార్డ్

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించగా ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తో పాటు పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మద్దతు ఇచ్చారు. దీంతో అధికారులు అప్పటినుంచి ఆ స్థలం విషయంలో మిన్నకుండిపోయారు. ఇటీవల కనకాలపేట, యుకెవినగర్, భీమ్ నగర్ ప్రజలు ఆందోళన నిర్వహించి డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా అడ్డుకున్నారు. దీంతో పట్టణ, గ్రామ ప్రాంతాల్లో కొన్ని రోజులపాటు ఎక్కడిచెత్త అక్కడే భారీగా నిలిచిపోవడంతో వీధులు మురికి కూపాలుగా మారాయి. ఈనెల 21న బంద్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేనిచోట డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని ఎంఎల్ఎ డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రభుత్వాన్ని కోరారు. లెఫ్టినెంట్ గవర్నర్, సంబంధిత శాఖ డైరెక్టర్‌కు సమస్య తీవ్రతను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. బంద్ నేపథ్యంలో స్థానిక అధికారులు చేసేది ఏమిలేక హడావడిగా గతంలో డంపింగ్ యార్డుకు నిర్ణయించిన స్థలంలో పోలీసు బందోబస్తు మధ్య చెత్తను డంపింగ్ చేశారు. దీన్ని గోపాల్‌నగర్ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. ఇక్కడ చెత్త కొన్ని రోజులు మాత్రమే వేస్తామని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు ఆందోళన కొనసాగిస్తున్నారు. సమస్య జటిలంగా మారడంతో స్థానిక అధికారులు చేతులెత్తేశారు. డంపింగ్ యార్డు అంశంపై ప్రభుత్వం మొదటి నుంచి ఉదాసీనంగానే వ్యవహరిస్తోంది.

శాశ్వత పరిష్కారం చూపాలి



యానాంలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. కొన్ని సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్‌తో కనకాల పేట, భీమ్ నగర్, యుకెవి నగర్ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాము. డంపింగ్ యార్డ్ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి.

- కోన చిన సత్తియ్య, కనకాలపేట నివాసి

డంపింగ్ యార్డ్ పెడితే ఊరుకోం



జనవాసాలు, స్కూల్స్, విద్యాలయాలు ఉన్నచోట డంపింగ్ యార్డ్ పెట్టడం సరికాదు. చెత్త వేస్తే ట్రాక్టర్లను అడ్డుకుంటాము. ప్రభుత్వం మొండి వైఖరి మార్చుకోకపోతే ఆందోళన విరమించేది లేదు. జనవాసాలు లేని ప్రాంతాలకు తరలించాలి.

- ఆరిశెట్టి రాజేష్ గోపాల్ నగర్ నివాసి

యానాం వార్తలు



విద్యుత్ సబ్‌స్టేషన్ డంపింగ్ యార్డ్ వద్ద మాట్లాడుతున్న గ్రామస్తులు

బలవంతంగా చెత్త వేయడం దారుణం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు గోపాల్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద డంపింగ్ యార్డ్‌లో బలవంతంగా చెత్తను వేయడం దారుణమని కాలనీవాసులు అన్నారు. యార్డు వద్ద జరుగుతున్న ఆందోళన ఆదివారం నాటికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా పోలీసులు బెదిరింపులు మధ్య చెత్తను వేస్తున్నారని ఆరోపించారు. పుదుచ్చేరి ప్రభుత్వం, అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ పెడితే ప్రజలకు అనారోగ్య సమస్యల తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దుర్వాసన కొడుతుందన్నారు. ఎవరూ లేని సమయంలో చెత్తను డంప్ చేయడం సరికాదన్నారు. తక్షణమే చెత్తను వేయకుండా ఆపాలన్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు స్పందించాలన్నారు.



పోలీసులను సత్కరిస్తున్న సిఐ షణ్ముగం,

పోలీసులకు సత్కారం

ప్రజాశక్తి - యానాం

దొంగతనం కేసులో సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న కనకాల వెంకటేశ్వర్లు తప్పించుకుని పారిపోయి కొద్ది గంటల వ్యవధిలోనే అతనని అరెస్టు చేసిన క్రైం పోలీసులు పబ్బినీడి ఏసుబాబు, మల్లాడి గణేష్, దేవరపల్లి సురేష్‌లను సిఐ షణ్ముగం ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సిఐ గూటం శివగణేష్, తోటి పోలీసులు పాల్గొన్నారు.



తొండంగిలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

పరీక్షలు రాసిన వయోజనులు

ప్రజాశక్తి - తొండంగి, తాళ్లరేవు

తొండంగి మండలంలోని 800 మంది వయోజనులు ఉల్లాస్ కార్యక్రమంలో పరీక్షలు రాశారు. ఆదివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన పరీక్షలకు పెద్దఎత్తున వయోజనులు పాల్గొన్నారు. అడల్ట్ ఎడ్యుకేషన్ ద్వారా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా విఒఎలు 800 మంది వయోజనులకు చదవడం, రాయడం, గణితం అంశాలతో కూడిన విద్యను ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వయోజనులు పరీక్షలు రాశారని ఎపిఎం సత్తిబాబు తెలిపారు. అలాగే తాళ్లరేవులో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని గత 3 నెలలుగా విఒఎలు మండలంలో 738 మంది నిరక్షరాశ్యులకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తికావడంతో ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు ఎపిఎం విష్ణుమూర్తి తెలిపారు. కోరంగి పంచాయితీ సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను నిర్వహించారు..



డాక్టరేట్‌ను అందుకుంటున్న బాలకృష్ణ

తోట బాలకృష్ణకు డాక్టరేట్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని మాధవపట్నం జమునానగర్ నివాసి తోలుబొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణకు అరుదైన డాక్టరేట్ పురస్కారం లభించింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు ఇతర ప్రముఖుల చేతులు మీదుగా ఆదివారం తోలు బొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణని పుదుచ్చేరిలో ఘనంగా డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారుడు తోట బాలకృష్ణ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ తన ప్రతిభ ను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసి, సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం దాతల సాయంతో యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, వేద పండితులు అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణపై పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు అంతా పోరాటానికి సిద్ధం కావాలని మాల సంఘాల జెఎసి ఛైర్మన్ పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చెలికాని భావనరావు సభా సదన్‌లో ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని నిరసిస్తూ మాల సంఘాల జెఎసి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాలలను అనగదొక్కే విధంగా ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సరైన సమాచారం లేకుండా 2011 జనాభా ప్రకారం వర్గీకరణ చేయడం చూస్తుంటే కేవలం ఇది చంద్రబాబు సర్కారు మాలలను అణచివేసే కుట్ర అని అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చెబ్రోలులో స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకొని నాయకులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా తమ సమస్యపై డిప్యూటీ సిఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేరని తెలపడంతో ఆ కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జెఎసి నాయకులు మారెళ్ళ సోమరాజు, బత్తిన శామ్యూల్, లింగం శివప్రసాద్, బంగా సతీష్, ఖండవల్లి లోవరాజు, కొంగు నూకరాజు, వేళంగి వెంకటేష్, మహేంద్రాడ సింహాచలం, పెదపాటి రాజేష్, ఉలవల భూషణం, తదితరులు పాల్గొన్నారు.



మాల జెఎసి నాయకులను అడ్డుకున్న పోలీసులు

ముగిసిన లయన్స్ క్లబ్ జిల్లా కన్వెన్షన్

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం కళ్యాణ మండపంలో 2 రోజులుగా జరిగిన లయన్స్ క్లబ్ జిల్లా యాన్యువల్ కన్వెన్షన్ ఆదివారం ముగిసింది. జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన 2వ రోజు కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల యాన్యువల్ బడ్జెట్ ఆడిట్ నివేదికలను ప్రవేశపెట్టారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ సభ్యులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు కృష్ణకుమార్, శ్రావణి దంపతులు, ఉమ, రాజేశ్వరి చేసిన నృత్యాలు, పాడిన గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు మంగాదేవి, వజ్రపు కోటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాసరావు, పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, దాసరి తిరుమలరావు, నడింపల్లి వినోద్, బిళ్ళకుర్తి శ్రీనివాస్ రెడ్డి, ధూలిపూడి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో ఆదివారం గోకవరంలోని విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సారేపల్లి దుర్గాప్రసాద్, ప్రయోగశాల సహాయకురాలు కె.సునీత పాల్గొన్నారు.



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపిపి నాయుడు సునీత అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ బడ్జెట్ సమావేశంలో ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు తాగునీరు, సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన పాలకవర్గం శిలాఫలకాన్ని ఎంపిపి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సత్యనారాయణ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

రైతుల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి - గండేపల్లి

పార్టీలకతీతంగా రైతుల కోసం పోరాడుదామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లూరు పుష్కర లిఫ్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ద్వారా 37,028 ఎకరాల భూమిలో రైతులు పంట సాగు చేస్తున్నారని, లిఫ్ట్ మరమ్మతుల గురవుతూ పూర్తిస్థాయిలో నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అసెంబ్లీలో లిఫ్ట్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆయనకు మద్దతుగా పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వత్సవాయి సత్యనారాయణరాజు, డాక్టర్ నక్క సత్యనారాయణ, నేదూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ట్రెజరీ కాలనీ పార్కులోఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రెజరీ కాలనీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రాజా రాంజీ ఆధ్వర్యంలో పి.సత్యనారాయణ, పండు, వై.సత్యనారాయణ, టెంట్ హౌస్ సురేష్, కాలనీ సెక్రటరీ జి. రాజేష్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దిలీప్ విజన్, పార్ధ డెంటల్ వైద్యులు, సిబ్బంది సేవలందించారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు మాజీ కార్పొరేటర్ జెడి.పవన్, నాయకులు పిడకా శేషు, నవీన్, గోవిందరాజులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం



వెంకటలక్ష్మి

మండల పరిధిలో 2019 అక్టోబర్ 15 వ తేదీ నాటికి ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది కలగని ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకుని నివసిస్తున్న లబ్ధిదారులు తమ ఇంటి స్థలం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు లబ్ధిదారుల ఆక్రమణంలో ఉన్న స్థలాలను మాత్రమే క్రమబద్ధీకరిస్తారన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారు మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. లేఅవుట్లు, కాలువలు, నదుల గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్, జల వనరులకు సంబంధించిన స్థలాలలో ఆక్రమణ స్థలాలు క్రమబద్ధీకరణ జరగదన్నారు. గతంలో ప్రభుత్వ స్థలం పట్టా పొందిన లబ్ధిదారులు క్రమబద్ధీకరణకు అనర్హులన్నారు. క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, భూమి స్థితిగతులు అధికారులు పరిశీలిస్తారన్నారు.

అందుబాటులో మార్కెట్ భూమికి పత్రాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెంలో మార్కెట్‌కి ఇచ్చిన భూమికి పత్రాలు అందుబాటులోనే ఉన్నాయని సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది రాజకీయంగా తనను ఎదుర్కోలేక దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆ భూమి కుమ్మర్ల మాన్యం 120 సెంట్లు వందల సంవత్సరముల నుంచి కుమ్మర్లు అనుభవిస్తుండగా 1988 సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన తహశీల్దార్ రైతు వారి పట్టాలు ఇచ్చారని తెలిపారు. వాటి ద్వారా పాస్‌బుక్‌లు పొంది పన్నులు చెల్లిస్తున్నామన్నారు. అందులో కొందరు అమ్మకాలు కూడా చేశారన్నారు.

నేడు పి- 4 సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో నిర్వహించిన పి-4 సర్వేపై సోమవారం గ్రామసభలు నిర్వహించబడతాయని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. సచివాలయాల పరిధిలో నిర్వహించిన పి - 4 సర్వే ద్వారా గుర్తించిన 20 శాతం పేద కుటుంబాల వారి జాబితాను గ్రామసభలో ప్రదర్శిస్తారని చెప్పారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని సూచించారు.

అనూస్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ వేసవి కాలంలో ర్యాలి సందర్శకులు, బాటసారుల దాహార్తి తీర్చడానికి స్థానిక అనూస్ హోమ్ వద్ద చలివేంద్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సౌభాగ్య గ్రూప్స్ అధినేత చిన్నం చంద్రారెడ్డి ప్రారంభించారు. తొలి రోజున చింతా లావణ్య కుమార్ సౌజన్యంతో పుచ్చకాయ జ్యూస్, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ సభ్యులు శ్యామ్ జాదుగర్, అన్నపూర్ణ, తేజశ్రీ, మోహిత్, సీతలు పాల్గొన్నారు.

బిసి కులగణన చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

దేశవ్యాప్తంగా బిసి కులగణన చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. కులగణనకు ఆధారంగా బిసిల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ సహకరించాలని ఆయన అన్నారు. ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్ లో వెంగళరావు యాదవ్ అధ్యక్షతన జాతీయ బిసి సంక్షేమ సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. సుప్రీం కోర్టు, హైకోర్టులలో జడ్జిలా నియామకంలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని ఆవు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా మట్ట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు గా కైల శోభన్ బాబు, కందుల విజయకుమార్, జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా రాయుడు సత్యరుష్, అధ్యక్షులుగా కాటాడి ఉమా మహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరశిఖ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా పావులూరి శివరామకృష్ణ, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, ట్రెజరర్, అధికార ప్రతినిధిగా కానుబోయిన దుర్గాప్రసాద్, ఎన్నుకున్నారు.